# తప్పు

"తప్పు చెయ్యనివాడు ధరణియందు గలడే!" కవి కామేశం విస్కీ గ్లాసులో మిగిలిన ద్రవాన్ని గొంతులో పోసుకుంటూ అన్నాడు.

"తప్పులు అందరూ చేస్తారు. కొందరు ఒప్పుకుంటారు. బహుకొద్దిమంది తప్పులు సరిదిద్దుకుంటారు" అన్నాడు ఆనందరావు ఆపిల్ జ్యూస్ చప్పరిస్తూ.

"నేను ఈ మూడింటిలో ఏ వర్గానికి చెందినవాడినంటావ్?"

"నాలుగో వర్గానికి చెందినవాడివి."

"అదేమిటి?!" ఆశ్చర్యంగా అడిగాడు కామేశం.

"నేను ఏం చేసినా రైటే – అనుకునే వెధవాయిల వర్గానికి చెందినవాడివి నువ్వు" నిర్మొహమాటంగా అన్నాడు ఆనందరావు.

నవ్వేడు కామేశం – "దాన్నే ఆత్మవిశ్వాసం అంటారు."

**లాయర్ కథలు - 12**

**కాటూరు రవీంద్ర త్రివిక్రమ్**



"ఆత్మవిశ్వాసానికది వక్రభాష్యం. అహంకారాన్ని కొందరు ఆత్మవిశ్వాసంగా చెప్పుకుని ఆత్మవంచన చేసుకుంటుంటారు."

"నాకు అహంకారం లేదు."

"ఎవరికి వాళ్లు ఈ మాటే అనుకుంటారు. అద్దంలో మన మొహం మనకి బాగానే ఉంటుంది. ఇతరులకక్కూడా బాగా ఉండాలి కదా?"

"అవన్నీ అలా ఉంచు. నాకు ఒక ఉపకారం చెయ్యి."

"ఏమిటో అది?"

"అర్జంటుగా నాకో పదివేలు అప్పు కావాలి."

"మనకి అర్జంటుగా అప్పు ఇచ్చేవాడు ఎక్కడ దొరుకుతాడు?"

"నాకు దొరకడు. నీకు దొరుకుతాడు."

"ఇస్తే నాకిస్తాడు. నీకెందుకిస్తాడు?"

"నువ్వు చెబితే ఇస్తాడు. వడ్డీ ఎంతైనా ఫర్వాలేదు."

"పెద్ద వడ్డీకి సిద్ధమనేవాడు అసలుకి ఎసరు పెడతాడు. కాబట్టి అలాంటి అప్పులకు నేను రికమెండ్ చెయ్యను."

"పోనీ తక్కువకి అప్పు ఇప్పించు. నాకు అభ్యంతరంలేదు."

"అసలింతకీ నీకు అప్పు దేనికి?"

"వేరే అప్పు తీర్చడానికి!"

"అప్పు కోసం అప్పన్నమాట! పత్రికాఫీసులో ఉద్యోగం వెలగబెడుతున్నావు కదా? వచ్చే జీతంతో గుట్టుగా బతక్క అప్పుల ఊబిలో ఎందుకు దిగుతున్నావు?"

"కొత్తగా దిగేదేముంది? దిగుడు బావిలో నీళ్ల కోసం దిగినట్టు ఏనాడో దిగాను..."

"తెలిసి తప్పు చేసేవాడిని ఎవరూ కాపాడ

లేరు. అప్పు తప్పని తెలిసీ చేసేవాడికి ఎవరూ సాయం చెయ్యరు. ఆడపిల్ల పెళ్లికి ఎదిగింది. కుర్రాడు కాలేజీ చదువుకొచ్చాడు. ఇలా అప్పులు చేస్తూ పోతుంటే పిల్లల భవిష్యత్తు ఏం కావాలి? ఎప్పుడన్నా ఆలోచించావా?"

"ఆలోచిస్తే అన్నీ భయపెడతాయి. అందుకే కవిత్వం తప్ప ఇంకేమీ ఆలోచించను."

"ఏం కవిత్వం నీ బొంద కవిత్వం? మాటల గారడీ తప్ప అర్ధమే కాదు... నువ్వు రాయకపోతే ప్రపంచానికేమి నష్టం?"

"కవిత్వం అంటే ఆత్మానందం కలిగించేది..."

"నీ ఒక్క ఆత్మకే కాదు... అన్ని ఆత్మలకూ ఆనందం కలిగిస్తేనే అది సిసలైన కవిత్వం. నా మాట విని ఇకనైనా ఆ పిచ్చి మాని ఇంటి బాధ్యతలు పట్టించుకో. పిల్లలు ఉసూరుమనకుండా ఉంటారు."

"ఇంతకీ నా అప్పు సంగతేమిటి? లేకపోతే ప్రమాదంలో పడతాను."

"అప్పే ఒక ప్రమాదం. ఇంకా కొత్త ప్రమాదం ఏముంటుంది?"

"అలా తేలిగ్గా కొట్టివేయకు. నాకు అప్పులు ఇచ్చిన వాళ్లు కోర్టులో దావాలు వేసారు. ఇల్లు జప్తుకి పెట్టారు. నాకున్నది



అదొకటే ఆధారం. దాన్ని చూసే ఇన్నాళ్లూ అప్పులు ఇచ్చారు. అది కూడా పోతే ఇక నా బతుకు బస్టాండే...”

“ఈ జ్ఞానం అప్పులు చేసే ముందుండాలి. నీ కోసం కాకపోయినా నీ పెళ్లాం పిల్లల కోసం నాకు తెలిసిన లాయర్ దగ్గరికి తీసుకెళ్తాను. ఆయనే నీకు దారి చూపిస్తాడు” అన్నాడు ఆనందరావు.

“సరే” అన్నాడు కామేశం.

*　　*　　*

కవి కామేశం చెప్పిందంతా విన్నాడు లాయరు భానుమూర్తి.

కోర్టు నుంచి వచ్చిన కాగితాలు చూసాడు.

“వ్యవహారం ఇంతవరకూ ఎందుకు తెచ్చుకున్నారు? ముందుగానే లాయరు దగ్గరకు ఎందుకు వెళ్లలేదు?” ప్రశ్నించాడు భానుమూర్తి.

“అసలే అప్పుల్లో ఉన్నాను. లాయర్ని పెట్టుకునే స్తోమతు లేదు...” అన్నాడు కామేశం. నవ్వేడు లాయరు భానుమూర్తి.

“ఇప్పుడు స్తోమతు వచ్చిందా?”

“మీ ఖర్చులు, ఫీజులు నేనిస్తాను లాయరుగారూ...” కల్పించుకుంటూ అన్నాడు ఆనందరావు.

“ఓహో... మీకు క్లోజ్‌ఫ్రెండ్ అన్నారు కదూ?”

“అవున్సార్. ఇద్దరం క్లాస్‌మేట్స్” అన్నాడు ఆనందరావు.

“ఆహార, వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించకపోతే సమస్యలు తప్పవు. ఇష్టం కదా అని తినకూడనివి అధికంగా తినకూడదు. తాగకూడనివి అతిగా తాగకూడదు. వ్యవహారం సీరియస్ అయినప్పుడు చూసుకోవచ్చులే – అని నిర్లక్ష్యం చెయ్యకూడదు. చెయ్యి దాటిపోయే ప్రమాదం ఉంది.”

“ఇప్పుడు యీ కేసు విషయం ఏమిటి లాయరుగారూ?” అడిగాడు ఆనందరావు.

“మీ మిత్రుడి ఇల్లుని కోర్టు ‘అటాచ్‌మెంట్ బిఫోర్ జడ్జిమెంట్’ చేసింది. సివిల్ ప్రొసీజర్ కోడ్ ఆర్డర్ 38 రూల్ 5 క్రింద అవతలి పార్టీ వారు పెట్టుకున్న అభ్యర్ధనను కోర్టు అంగీకరించింది.”

“అంటే ఇల్లు కోర్టు ఆధీనంలోకి వెళ్లిపోయినట్లా?” కామేశం కంగారుగా అటగాడు.

“అవును అలాగే భావించాల్సి ఉంటుంది” అన్నాడు లాయరు.

“ఇప్పుడెలా?!” ఆందోళనగా ప్రశ్నించాడు కామేశం.

“అసలు మీరు అప్పు ఎంత తీసుకున్నారు?”

“ఒక్కసారిగా తీసుకోలేదు లాయరుగారూ! ఇంటి దస్తావేజులు తనఖా పెట్టి అవసరమైనపుడల్లా అయిదువేలు, పదివేలు తెచ్చుకునేవాడిని. వాళ్లు ఖాళీ ప్రోనోట్లు మీద సంతకాలు పెట్టించుకునేవాళ్లు.”

“అంటే మీ సమాధిని మీరే తవ్వుకున్నారన్న మాట!”

“అదేంటి లాయరుగారూ!”

“అంతేగా మరి! శరీరం నాది... నా యిష్టం అనుకుని ఆత్మహత్య చేసుకునే వాళ్లకీ మీకూ తేడా ఏమిటి? పెద్దలు ఇచ్చిన ఇల్లు ఒక రక్షణ గూడు లాంటిది. మీ కుటుంబం తిన్నా తినకపోయినా గుట్టుగా అందులో బతకొచ్చు. దాన్ని కూడా లేకుండా చేసే అధికారం మీకెవరిచ్చారు? పోనీ, అదేమన్నా పిల్ల పెళ్లికో, పిల్లాడి చదువుకో తాకట్టు పెట్టారా? మీ మిత్రుడు

చెప్పినదాన్ని బట్టి తాగుడు కోసం మీరు అప్పులు చేసారు. చేస్తున్నారు. ఏమి సాధించారు? తాగి తాగి ఆరోగ్యం పాడుచేసుకున్నారు. మీకు లివర్ పాడయినా తాగుతున్నారటగా? మీరే దారి తప్పితే మీ పిల్లలకేం దారి చూపిస్తారు? తాగుడు స్లో పాయిజన్. ఆరోగ్యాన్ని, గౌరవాన్ని, ధనాన్నీ నాశనం చేస్తుంది. దానికంటే ఆత్మహత్యే నయం."

కామేశం అపరాధిలా తలదించుకున్నాడు.

"మిత్రులతో సరదాగా మొదలుపెట్టింది నన్నిలా పతనం చేస్తుందనుకోలేదు లాయరుగారూ..."

"మీరు చదువుకున్నారు. కవిత్వం కూడా రాస్తారట. నిప్పు కాలుతుందని, దురలవాట్లు దంపనాశనం చేస్తాయనీ ఎవరు చెప్పాలి?"

"నన్ను క్షమించండి లాయరుగారూ! నేను అన్నీ తెలిసిన మూర్ఖుణ్ని. నా తప్పు దిద్దుకుంటాను. నన్నీ ఆపద నుంచి గట్టెక్కించండి..." కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు.

"సరే – నా ప్రయత్నం నేను చేస్తాను. ఆనందరావుగారూ! ఈయన మీ మిత్రుడు గనక, అవతలి పార్టీకి నచ్చజెప్పి, పెళ్లి కావాల్సిన ఆడపిల్ల కోసమైనా జాలిపడి, ఇచ్చిన అప్పుకి తక్కువ వడ్డీకి రాజీపడేలా ఒప్పించండి. వీరి ఇల్లుని కొనేవాళ్లుంటే, వాళ్ల దగ్గర అడ్వాన్సు తీసుకుని, బాకీ తీర్చి రాజీ పడండి. అవతలి లాయరుతో నేను మాట్లాడతాను."

"అలాగే లాయరుగారూ! వీడికి అభ్యంతరం లేకపోతే మార్కెట్ రేటుకి వీడిల్లు నేనే కొంటాను. అయితే అప్పు తీర్చగా మిగిలిన మొత్తాన్ని పిల్లలు, భార్య పేర్న బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తాను. ఏరా... నీకు ఇష్టమేనా?" అడిగాడు ఆనందరావు.

"అలా చేస్తే జన్మజన్మలకూ నీకు రుణపడి ఉంటాను" చేతులు జోడించాడు కామేశం.

"సాధారణంగా అటాచ్‌మెంట్‌లో ఉన్న ఆస్తిని అమ్మితే సి.పి.సి. సెక్షన్ 64 క్రింద చెల్లుబాటు కాదు. కానీ, మీరు రుణదాతల బాకీ తీర్చివేస్తే, అటాచ్‌మెంట్ క్రింద తీసుకోగల చర్య ఏమీ ఉండదు కాబట్టి అది చెల్లుబాటవుతుంది."

"జడ్జిమెంట్‌కి ముందే అటాచ్‌మెంట్ ఎలా చేస్తారు లాయరుగారూ?" సందేహ నివృత్తి కోసం అడిగాడు ఆనందరావు.

"రుణగ్రస్తుడు తన ఆస్తిపాస్తుల్ని కాపాడుకునేందుకు ఇతరులకు అమ్మకం ద్వారా లేదా బినామీ వ్యవహారంగా బదిలీ చేస్తాడనే అనుమానం ఉన్నప్పుడు సి.పి.సి. ఆర్డర్ 38 రూల్ 5 క్రింద జడ్జిమెంట్‌కి ముందే అటాచ్ చేసుకోవచ్చు. వాది కోర్టు వారికి ప్రతివాది ఆస్తి వివరాలతో బాటు విలువ కూడా తెలుపాల్సి ఉంటుంది. దానిని బట్టి ఆస్తి మొత్తం లేక కొంత భాగాన్ని 'అటాచ్' చేస్తారు. కేసు ముగిసే వరకూ సదరు ఆస్తిని ఎవరికీ బదిలీ చేయరాదు. చేసినా చెల్లదు. రుణగ్రస్తుడ్ని అరెస్ట్ చేయించే అవకాశాలూ చట్టంలో ఉన్నాయి. ముందు మీ మిత్రుడ్ని బయటపడేయండి" అన్నాడు లాయర్ భానుమూర్తి.

"అలాగే సార్! మళ్లీ త్వరలోనే పూర్తి సమాచారంతో మీ దగ్గరకు వస్తాం!" అంటూ వెళ్లడానికి లేచాడు ఆనందరావు.

"వస్తాను లాయరుగారూ!" అంటూ కామేశం మిత్రుడ్ని అనుసరించాడు.

లాయర్ భానుమూర్తికి ఒక వ్యక్తిలో మార్పు తెచ్చి, కుటుంబం రోడ్డున పడకుండా కాపాడగలిగినందుకు సంతోషం కలిగింది. అందుకే ఆయన చాలా మంచి లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు. ●